### 7.2.6 విప్లవ కవిత్వం

చెరబండరాజు, నగ్నముని, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి దిగంబర కవులుగా పేరుపొందిన వీరు విప్లవకవులుగా పరిణమించారు. నగ్నముని తూర్పుగాలి, కొయ్యగుర్రం, చెరబండరాజు పల్లవి, జన్మహక్కు, ముట్టడి, గమ్యం అనే కావ్యసంపుటాలు, జ్వాలాముఖి ఓటమి, తిరుగుబాటు, నిఖిలేశ్వర్ మండుతున్న తరం కావ్యాలు తిరుగబడు కవుల కవితావేశాన్ని ప్రకటిస్తున్నాయి.

మనిషికి మనిషికి అడ్డుగోడలు లేని, ఆర్థిక అసమానత్వం లేని ప్రపంచాన్ని, ప్రమాణాల్ని, ప్రభుత్వాన్ని నిర్మించాలనేది వీరి ఆశయం. సమగ్ర ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలని, రేపును సమతాకాంతి లోకంగా తీర్చి దిద్దాలని అంటున్నారు శివారెడ్డి. శివారెడ్డి రక్తం సూర్యుడు, చర్య, నేత్రధనుస్సు, భారమితి కవితా సంపుటాలలో మౌలికంగా వ్యక్తమయ్యే అంశాలు సుసంఘటిత సమసామాజిక వ్యవస్థా స్థాపనకు సాయుధ విప్లవం, సంఘర్షణాత్మక చైతన్యం.

సాహిత్యం సమాజం విడదీయరానివి. మార్పులను, చేర్పులను, అవసరాలను ఆశయాలను, కొత్త రూపాలను సంతరించుకుంటూ సమాజం పోయే పోకడలను విమర్శిస్తుంది సాహిత్యం. సామాజిక జీవిత సంస్కరణకోసం అనేక ఉద్యమాలు ఏర్పడ్డాయి. సంస్కరణోద్యమం, జాతీయోద్యమం, తెలంగాణోద్యమం, గిరిజనోద్యమం, విప్లవోద్యమం విప్లవాలను తీసుకువచ్చాయి. జీవితాన్ని మార్చటానికి సాహిత్యాన్ని ఆయుధంగా ప్రయోగించారు. ఈ విప్లవ రచయితల సంఘంగా ఏర్పడి విప్లవాన్ని కవితా స్పందనగా, జీవనాడిగా చేసుకొని అసమానతా వ్యవస్థను పెకలించి సమతా ధర్మస్థాపనే ధ్యేయంగా భావించి రచనలు కొనసాగించి సామాజిక దృక్పథంలో మార్పు తీసుకొచ్చారు.

అజ్ఞాత సూరీడు, గౌతమ్, ఎం.ఎస్.ఆర్, అనామధేయుడు, సముద్రుడు, కాశీవిశ్వనాథ్, వీరన్న, భూమన్న, కౌముది, మోహన్, భాస్కర్ విప్లవోద్యమ కవులుగా కవితా సంపుటాలను వెలికి తెచ్చి విప్లవోద్యమ స్ఫూర్తిని కలిగించారు.

'హింసతోనే సృష్టి పూస్తాది, హింసతోనే మార్పు వస్తది' అని కంచుకోటలా స్థిరపడిన దోపిడీ వర్గ సమాజాన్ని కూల్చటానికి ఆయుధం అవసరం. 'శిశూదయం' కోసం ఉద్యమాలు నడిపించి విప్లవాల యుగాన్ని సృష్టించాలన్నది శ్రీశ్రీ ధ్యేయం.

"పాతకి గోరీ కట్టాలని
కొత్తకి భేరీ కొట్టాలని" [1] ఉగాది స్వగతాలు

'ఉగాది స్వగతాలు' కవితలో అభ్యుదయ కవి, విప్లవకవి, జోహుకుం కవి స్వగతాలను శ్రీశ్రీ వర్ణించారు.

'పెదవి మీద సామ్యవాద మంత్రం, హృదయంలో ధనికవాద తంత్రం; భావకవులతో నా పొత్తూ, విరసం పోకడ నాకొద్దూ' అన్నట్టుగా అభ్యుదయకవులు పైకి వల్లె వేసేవి ఒకటైతే చేసేవి దానికి విరుద్ధంగా ఉన్నాయని, నటిస్తున్నారని విమర్శించారు. మారని సమాజం పట్ల విముఖత ఏర్పడి చివరకు పరిస్థితులకు తల ఒగ్గి అభ్యుదయ కవి అన్నిటికి సై అనే పరిస్థితి ఏర్పడింది. ఆర్థిక సమానత్వం రావాలనే లక్ష్యంతో సాగింది విప్లవోద్యమం. విప్లవకవి ఆర్థిక అసమానతలకు తల్లడిల్లి అయోమయ పరిస్థితిలో నీల్గుతున్నాడు విప్లవ కవి...

"మార్పు వచ్చి తీరుతుంది ఎందుకంటే
కాలం పరిణామశీలం
దాన్ని మన కనుకూలంగా మలచుకోవడమే ప్రధానం" [2]

జోహుకుం కవి భవిష్యత్కాల దర్శనంకోసం వేచి ఉన్న కవి. సామాజిక విప్లవ సమరం, గత సంస్కృతి మరణం ఇదే నేటి సత్యమని ఆ పునాదుల మీదే

---

1. శ్రీశ్రీ, మరోప్రస్థానం, శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం – 15, కూర్పు చలసాని ప్రసాద్, విరసం ప్రచురణ, 1989, పుట 96.
2. శ్రీశ్రీ, మరోప్రస్థానం, పుట 96



ఉషస్సు ఉదయిస్తుందని అభ్యుదయ కవులు, విప్లవ కవులు తీసుకు రాలేని పరిణామాన్ని త్వరలోనే పొందగలమని సడలని విశ్వాసాన్ని ప్రకటించారు.

విప్లవ 'ఉద్యమం నెలబాలుడు' అని శివసాగర్ విముక్తి పోరాటంలో ఎదురయ్యే ఆటుపోటులకు భయపడి వెనుకంజ వేస్తున్న వారిని నెలబాలుడని వ్యవహరిస్తూ ఈ నావ చేరవలసింది సుదూర తీరమనీ మార్గ మధ్యంలో పెనుతుఫానులు, సుడిగుండాలు తప్పనివని' హెచ్చరించారు.

సాయుధ పోరాటం తప్ప మరోమార్గం లేదని ప్రపంచ పరిణామం పదేపదే చెబుతున్నది.

"కాలం పురోగమిస్తుంది–ఆగదు
విప్లవం జ్వలిస్తోంది–చావదు
ఉద్యమం నెలబాలుడు
పెరిగి పెద్దవాడై
వినూత్న జీవిత మహాకావ్యాన్ని రచిస్తాడు–తప్పదు".[1]

విప్లవ కవి గద్దర్ సంగీతంతో నాగరిక మనిషిని, జానపదుడిని కదిలించగలిగారు. మానసిక చైతన్యం విప్లవ చైతన్యంగా మారటానికి జానపద పాటని, బాణీని ఉపయోగించుకున్నారు. పచ్చి నెత్తురు తాగే ఎముకల రాజ్యం అంతమై ఎర్రసీమ వెలుస్తుందని విప్లవ ప్రబోధాల మూలంగా గద్దర్ ప్రజలలో చైతన్యాన్ని కలిగించారు. శ్రీశ్రీ, పాణిగ్రాహి, శివసాగర్, చెరబండరాజు, గద్దర్, వంగపండు ప్రసాద్ ఈ విప్లవ మార్గంలో మైలు రాళ్ళు.

---

1. శివసాగర్, ఉద్యమం నెలబాలుడు, సృజన ప్రచురణలు, హనుమకొండ, 1983, పుట 52.

'నమ్ము' గోదావరి లోయ కవితలో మాతృదేశ ఋణాన్ని తీర్చుకుంటానని, "నా స్థిర సంకల్పం ఉజ్జ్వల భవిష్యత్తుకు స్వాగతం పలికేందుకు రక్తం తోరణాల మధ్య కనురెప్ప వాల్చని జాగ్రతలో సాయుధమై నిల్చున్నది" [1]

దానికి సాయుధ పోరాటమే పరిష్కారమని, ఈ విప్లవం రేపటి కోసం జరుగుతున్న సమరమని, సమరానికి కావాలసిన స్ఫూర్తి గోదావరి లోయ కల్పిస్తుందని వ్యక్తం చేసారు. సూర్యుడుదయించి, అస్తమించినట్లు వ్యవస్థకూడ పడిపోతున్నది. సూర్యుడస్తమించి రూపం నశించి కూడా రశ్మిగా వ్యాపిస్తున్నాడు. మార్పు అనేది 'మొన చూపాలి'. 'ముడతల రాత్రి మసి పాతలో ముడిచిన ఉత్తమ వజ్రం'[2] సూర్యుడు. మళ్ళీ ఉదయించటం తథ్యం. అటువంటి అస్తమయాన్ని నిబ్బరంగా నిన్ననే ఎదిరించి ఇప్పుడు నవోదయానికై నడుస్తున్నాడు కెవీయార్.

రేపటి గాలి పాడే పాట ఈనాడే వినవస్తున్నది. ఆ పాట పోరాటాల పాటలాగ గుండెల సందడి రేపుతుంది. కాలం వేసే తొలి ముందంజ తానై భావి మీద కాల్జాపి భవిష్యత్తును అందుకుంటానంటారు.

"భూతకాల మృతదేహం ప్రస్తుత కాలం చితిపై పేర్చి
పరిణామాగ్ని జ్వాలను పోరాటాగ్నులతో మండించి" [3]
రేపటి గాలి పాడే పాట...

కెవీయార్ 'చూడు రేపటిలోకి' కవితలో ప్రవాహగతి మారుతుందని గత కాలానికి ఎడంగా ఊరి నుండి పుడుతుంది భవిష్యన్మహ ప్రవాహిని అని, ఆ

1. నమ్ము, గోదావరి లోయ కవితలు, పాటలు, ఉదయసాహితి, 1981, పుట 36.
2, 3. కెవీయార్, సూరీడు మావోడు, విరసం శకం కవితలు, ఝంఝం ప్రచురణలు, 1980, పుట 55, 57.



ప్రవాహ ధాటికి ఎదురీదటం సాధ్యం కాదని రేపటి భవిష్యత్తు తమదేనని ఘంటాపథంగా ప్రకటిస్తున్నారు.

'నిజానికి మనిషి పుట్టినప్పుడేమీ కాదు
జీవన పోరాటంలో మనిషి ఉద్భవిస్తాడు
మనిషి మాత్రం సమాజాన్ని మార్చి తీరుతాడు!'.[1] – మనిషిలా బ్రతకడం

పాతది పూడ్చుకుపోయి, నవతరానికి పునాది వేస్తుంది. ఆ సుందరవనం మానవుని కళల సాధనం. శాంతి స్వేచ్ఛగా విహరిస్తుంది. ఉద్యమం నెల బాలుడు అజానుబాహుడలో ఉజ్జ్వల తారగా ఆకాశాన నిలుస్తాడని భవితవ్యం చూసారు[2] (భవితవ్యం) సముద్రుడు.

గతం ఒక కలలా చెరిగిపోతుంది. రేపటి భవిష్యత్తు అలలా సవాల్ చేస్తుంది. విప్లవ కవులు భవిష్యత్తు సమాజంలో మార్పు తెస్తుందని సమాజాన్ని నిలదీస్తుందని, అరాచకత్వం పెరుగుతుందని, అగ్రవర్ణాలు తాము వేసిన వలలో తామే చిక్కుకుంటారని ఆశిస్తున్నారు. విప్లవ కవులు సమీప భవిష్యత్తును సూచిస్తున్నారు. వీరు ఆశించేవి త్వరలో సంభవించేవిగా దర్శనమిస్తాయి.

" 'నిన్న' – ఒక కల
మంచైనా
చెడయినా
మేల్కొంటే నిలవదు.

1, 2. సముద్రుడి సమయం, సముద్రుడు, విప్లవ రచయితల సంఘం, 1994, పుట 74, 78.

'రేపు' – ఎదురొచ్చే అల
ప్రభువయినా
పేదయినా
సవాల్ చేయక వదలదు". [1] – రేపు

"ఈ చీకటిలో
రేపు
సూర్యుడుదయించని
చెబుతున్నందుకు క్షమించండి
సూర్యుడు నా నరాల్లో చిక్కుకున్నాడు
ఐనా
మీరేం భయపడకండి
రేపు నా త్యాగం ఉదయిస్తుంది". [2] – హామీ

విప్లవ వీరుల జీవనాన్ని సూచిస్తుంది. అడవి విప్లవానికి పునాది. అడవి విప్లవానికి తల్లై పుట్టిన్నిల్లై కొడుకుల్ని కోల్పోయినా వారసుల్ని పల్లె పొత్తిళ్ళల్లో ఆడించి చైతన్యాన్ని పెంచింది. విప్లవం పాఠశాలకు పంతులమ్మ అయ్యింది. రేపటి విజయానికి పునాది. విప్లవానికి, వారసులకు, పాఠశాలకు, విప్లవవీరులకు, రేపటి విజయానికి, మాతృక అడవి.

"అడవి అప్పుడు తన కొడుకుల్ని కోల్పోయిన తల్లి
అడవి ఇప్పుడు పల్లె పొత్తిళ్ళలో వారసుల్ని ఆడిస్తున్నది
అడవి రేపటి అనేకానేక విప్లవ వీరులకు పునాది
అవును! రేపటి విజయానికి పునాది అడవి". [3] – పునాది

---

1. బండారు పర్వతరావు, నెలనెలావెన్నెల, హైదరాబాద్, 1990.
2,3. అరణ్య నేత్రం, జయధీర్ తిరుమలరావు, విప్లవ కవిత్వం.



శ్రమ జీవులదే లోకమని, వారి 'చేతిలోని ఎత్తిన పిడికిలి కత్తుల'తో పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడులను నేల కూలుస్తామని కలాల గళాలు విప్లవధ్వజాలై చేతన శక్తులు వేకువ రాగాలై చీకటి గుండెల చెరసాలల్లో రేపటి ఉదయాన్ని చూపిస్తున్నాయి.

"రేపటి ఉదయం చూపిస్తున్నాయ్
జగతికి సమతను చాటిస్తున్నాయ్
పలిత దళిత జనసింహ ఘర్జనలె
తిరుగుబాటులే క్రాంతి బావుటాలై
చీకటి పొదల శిధిలావస్థని
రేపటి ఉషస్సు వేకువజామున
మానవ చరిత్ర మార్చేస్తుంది". [1] – ప్రతిధ్వని

తిరుగుబాటు మానవ చరిత్రను మార్చేస్తుందని భవిష్యత్తులో సమాజంలో మార్పు రావాలంటే తిరుగుబాటు క్రాంతి బావుటాలే మార్గమని సూచిస్తున్నారు.

పట్టణాలలో భవంతులే పూల చెట్లు (ఫ్లాటులు)
"గుభాళిస్తాయా
వాసనలేని యిటుక పూలూ
మెత్తగా పట్టుకుచ్చుల్లా చెంపల్ని నిమురుతాయి
సుకుమారంగా పక్షి యీకల్లా
కలలై ఆలోచనల్ని స్పృశిస్తాయి
పసిపాపల కంటి పాపల స్వచ్ఛతని పొదిగిన ఇటుకల పూల చెట్టు

---

1. సంపాదకుడు కె. ప్రతాపరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, హైదరాబాద్, 1986.

దూర తీరాల నుండి

అనంతమైన ప్రశాంతతను మోసుకొొచ్చిన

తెల్లని పావురంలా సాక్షాత్కరిస్తుంది". [1] – ఇక్కడ పూల చెట్టు

ప్రపంచీకరణ నేపథ్యంలో మారుతున్న సామాజిక స్వరూపాన్ని లలిత పదాలతో వర్ణించారు. ఆకాశంలో నక్షత్రాల్లా 'వెన్నెల పూలు పూసిన అడవిలోని రాత్రిలా' ఆకుల పచ్చదనాన్ని కప్పేసిన పూవుల లాలిత్యం ఒకనాటి సౌందర్యమయితే ఈనాడు రోజు రోజుకి పెరిగిపోతున్న ఆకాశాన్నంటే భవనాలు పచ్చదనాన్ని మింగేసి మురిపిస్తున్నాయి. ఇటుక పూల చెట్టు తెల్లారేలోగా ఇంటి పెరట్లో వాలినట్టుంది. వాసనలేని ఇటుక పువ్వులు కలలై ఆలోచనల్ని స్పృశిస్తాయి. స్వచ్ఛత ప్రశాంతత మోసుకొొచ్చినట్టుగా తెల్లని పావురంలా సాక్షాత్కరిస్తుంది.

"రేపటిపైన ప్రగాఢ విశ్వాసంలా

ఎరుపెక్కుతున్న వర్తమానంలో

ఎదురుచూస్తున్న

అందమైన భవిష్యత్తు స్వప్నంలా విరాజిల్లుతుంది". [2]

– ఇక్కడ పూల చెట్టు

'దుఃఖం సమీకృతమవుతున్న దృశ్యం', 'పాటలని నిషేధిస్తున్నవారే పాటలని అమ్మకానికి పెడతారు' కవితలలో నారాయణస్వామి పరాయీకరణలో భవిష్యత్స్వప్నాల్ని దుమ్ములో నిర్దాక్షిణ్యంగా కలిపే ప్రయత్నంలో మన జీవితాలను, మన దుఃఖాలను సమీకృతం చేసుకుంటున్నాం. ఒక్కడి కన్నీరయితే పేచీలేదు. అందరి బతుకులు దుఃఖ పూరితమయ్యే స్థితి ఎదురవుతుంది. సమీకృత పోరాటం

---

1 కల్లోల మేఘం, నారాయణస్వామి, వి.ర.సం., జంటనగరాలు.

2. కల్లోల మేఘం, నారాయణస్వామి, వి.ర.సం., జంటనగరాలు.



తప్పదని అప్రజాస్వామిక దమననీతి గలవారిని రేపటి ఉషస్సు నిషేధిస్తుందని వర్ణించారు.

విప్లవ కవులందరూ గతంలో తమకు జరిగిన అన్యాయాలను దుయ్యబట్టి వర్తమాన కాలంలో సాయుధ పోరాట పిలుపునిచ్చి సమైక్యతతో ఏనాటికైనా తమ లక్ష్యాన్ని సాధిస్తామని అది త్వరలోనే వస్తుందనే ఆశను వ్యక్తం చేసారు. వీరు ఆశించిన లక్ష్యం ఎంతో దూరంలో లేదు. సమీప గత భవిష్యత్తులో సంభావ్య భవిష్యత్తుగా భావించవచ్చు. అభ్యుదయం, విప్లవం అని మాట్లాడిన వారు కొందరు వెనుకంజ వేయటాన్ని విమర్శించారు విప్లవోద్యమాలు బలంగా సాగుతున్న కాలమిది.

కవులు ఆయా చట్రాలలో ఇమిడిపోయి, ధోరణులలో ఇరికిపోయారు. ప్రణయ, ప్రకృతి స్వప్నలోకం, ఆగామి ఆశలలోకం, రాజకీయ నేపథ్యంతో కూడిన వాస్తవలోకం మనకి కనిపిస్తుంది. ప్రకృతి ప్రపంచం నుండి కవిత్వం క్రమంగా ప్రజలకు చేరువయ్యింది. అట్టడుగు మనిషిని ఆలోచింపజేసింది. చేపట్టిన ఉద్యమాలు అనుకున్నంత లక్ష్యాన్ని సాధించలేక పోవటానికి కారణాలు సమష్టి భావం పోయి వ్యష్టి భావం ప్రధానమయ్యింది. సమష్టి భావంతో కొనసాగవలసిన ఉద్యమాలు వ్యష్టిభావం వలన దెబ్బతింటున్నాయి.

వ్యక్తిగతానుభవానికి ప్రాధాన్యమిస్తూ అంతర్గత సాహిత్య ధోరణి ముందుముందు మరింత బలపడి సమీప భవిష్యత్తులో ఆవిష్కృతమవుతుందని భావించవచ్చు. బాహ్య సంపదను సమకూర్చుకోవటంలో ఉన్నంత శ్రద్ధ అంతర విలువలను సమకూర్చుకోవటంలో కనిపించటం లేదు. మనిషి బాహ్యంగా ఎత్తుకు ఎదిగినట్టుగా కనిపించినా ఆంతరంగికంగా దిగజారిపోతున్నాడనేది వాస్తవం. అందుకే కవులందరూ గతంలో జీవించినా, వర్తమానంలో ఉన్నా భవిష్యత్తు వైపు చూసినా కోరుకునేది ఒక్కటే. మనిషి మనిషిగా నిలబడాలని, అతడికున్న విలువలు పతనం కాకూడదని వాంఛిస్తున్నారు.